ఉక్కపోతకు ఉపశమనం.. 2





2 మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## అంగన్‌వాడీలకు ఉచిత విద్యుత్



**అక్షరటుడే, బోధన్:** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం అంగన్‌వాడీలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని ట్రాన్స్‌కో కన్‌స్ట్రక్షన్ ఏడీఈ రాజ శేఖర్ పేర్కొన్నారు. బుధవారం ఎంఎస్సీ ఫారంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సర్పంచ్ జయశ్రీ శ్రీనివాస్ గౌడ్ సమక్షంలో విద్యుత్ మీటర్ కనెక్షన్ ఏర్పాటు చేశామన్నారు. అనంతరం తోట రాజశేఖర్ మాట్లాడుతూ.. మొదటి విడతలో భాగంగా బోధన్ డివిజన్‌లో 129 విద్యుత్ సరఫరా లేని అంగన్‌వాడీలకు ఉచిత విద్యుత్ కనెక్షన్ ఉచితంగా ఇవ్వడం జరిగిందన్నారు.



## ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైంది..



**అక్షరటుడే, కామారెడ్డి:** ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు అంత్యంత విలువైనదని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో ప్రక్రియలో భాగంగా ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ గురువారం పట్టణంలోని తన నివాసంలో వివరాలను నమోదు చేసుకున్నారు. జిల్లా ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారులు ఈ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు జాబితాల సవరణను ఎన్నికల సంఘం, అధికార యంత్రాంగం పారదర్శకంగా నిర్వహించాలని, అర్హుల పేర్లు తొలగిపోకుండా, డూప్లికేట్ ఓట్లు కొనసాగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సర్పంచులు, కౌన్సిలర్లు, బీఎల్‌ఏలు, బీఎల్‌వోలు సమన్వయంతో ప్రతి ఇంటికి వెళ్లి జాబితాలను పరిశీలించాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదయ్యేలా సహాయం అందించాలని, డూప్లికేట్ నమోదులను గుర్తించి తొలగించాలని కోరారు. దేశవ్యాప్తంగా కొన్ని రాష్ట్రాల్లో ఓటరు జాబితాల నిర్వహణపై అనుమానాలున్నాయని, ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు విశ్వాసం కలిగేలా పారదర్శకత పాటించాలని అభిప్రాయపడ్డారు. ప్రతి ఓటు సమాన విలువ కలిగి ఉంటుందని, ఓటు హక్కును కాపాడడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు.



## ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణకు అందరూ సహకరించాలి

**అక్షరటుడే, ఇందూరు:** ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు అందరూ సహకరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్‌ను అనుసరిస్తూ ఎస్ఆర్ఐ ప్రక్రియ అమలులో భాగంగా బూత్ లెవెల్ అధికారులు గురువారం నుంచి ఇంటింటి సందర్శనకు శ్రీకారం చుట్టారు. దీంట్లో భాగంగా బీఎల్‌వో రుక్మిణి, సూపర్వైజర్ హరీష్ రెడ్డి గురువారం కలెక్టర్ క్యాంప్ ఆఫీస్‌లో పాలనాధికారి ఇలా త్రిపాఠిని కలిసి ఎన్యుమరేషన్ ఫారం అందించారు. వీటిని పూరించి, ఒక ఫారంను తిరిగి ఇవ్వాల్సిందిగా కోరారు. కలెక్టర్ నివాసాన్ని సందర్శించి ఎన్యూమరేషన్ ఫారం అందించినట్టుగా ఆన్‌లైన్ ద్వారా బీఎల్‌వో మొబైల్ యాప్‌లో అప్‌డేట్ చేశారు.



# బడుల్లో అల్పాహారం!

**ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదివే పేద విద్యార్థులకు ప్రభుత్వం అల్పాహారం అందించనుంది. ఈ పథకాన్ని ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ క్రమంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పలు విద్యాసంస్థల్లో ఈ పథకాన్ని ప్రారంభించడానికి సిద్ధమవుతోంది. దీంతో వేలాది మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది.** - అక్షరటుడే, భీమ్‌గల్

- ఉమ్మడి జిల్లాలో త్వరలో అమలుకు ఏర్పాట్లు
- ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు లబ్ధి

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ బడుల బలోపేతం కోసం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం అల్పాహారం అందిస్తామని గతంలో తెలిపింది. ఈ మేరకు ఇటీవల పథకాన్ని ప్రారంభించింది. కాగా.. జిల్లాల్లో అమలుకు సిద్ధమవుతోంది. దశల వారీగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో అమలు చేస్తామని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా పేర్కొన్నారు. ఈ మేరకు నాలుగు నెలల్లో పూర్తిస్థాయిలో అమలు చేసే విధంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ మేరకు అధికారులతో మాట్లాడారు. ప్రభుత్వ నిర్ణయంతో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల పరిధిలోని వేల మంది విద్యార్థులకు వారంలో ఆరు రోజులు ఉదయం పూట వేడివేడి నాణ్యమైన అల్పాహారం అందనుంది. ప్రభుత్వం ఎంపిక చేసిన పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ ఈ పథకం వర్తింపజేయనున్నారు.

### ప్రత్యేక నిధులు

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఈ పథకం సజావుగా సాగడానికి మౌలిక వసతుల కల్పన, పాత్రలు, రవాణా ఖర్చుల కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులను విడుదల చేసింది. ఒకటి నుంచి ఐదో తరగతి చదువుతున్న చిన్న పిల్లలకు రోజుకు 75 మి.లీ., ఆపై తరగతుల విద్యార్థులకు 100 మి.లీ. చొప్పున వారంలో మూడు రోజులు పాలు, మరో మూడు రోజులు రాగి జావను అందించనున్నారు. అలాగే టిఫిన్ పెట్టనున్నారు.

### మెనూ వివరాలు

| | |
|---|---|
| మొదటి రోజు: | దోశ, చట్నీ, సాంబారు |
| రెండో రోజు: | మిల్లెట్ ఇడ్లీ, సాంబారు |
| మూడో రోజు: | పూరీ, మిక్స్‌డ్ వెజిటబుల్ కుర్మా |
| నాలుగో రోజు: | బోండా, చట్నీ, సాంబారు |
| ఐదో రోజు: | ఇడ్లీ, చట్నీ, సాంబారు |
| ఆరో రోజు: | ఉప్మా, చట్నీ, సాంబారు |

### బ్రేక్‌ఫాస్ట్ అమలు బాధ్యత అధికారులదే..



రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా గురువారం నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులు ఏ ఒక్కరూ కూడా ఉదయం వేళల్లో ఆకలితో ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా 'బ్రేక్‌ఫాస్ట్ సిస్టమ్'ను అమలు చేస్తోందన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ అల్పాహార పథకం నిరంతరాయంగా, నాణ్యతా ప్రమాణాలతో సాగాలని సూచించారు. దశల వారీగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో వచ్చే నాలుగు నెలలలో అల్పాహారం, మధ్యాహ్న భోజనం అమలులోకి వస్తుందని తెలిపారు. సర్కారు బడుల అభివృద్ధికి, ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ముందుకు వెళ్తోందని పేర్కొన్నారు. విద్యార్థులకు అవసరమైన తాగునీరు, వాష్ రూములు, బెంచీలు, డిజిటల్ తరగతులు వంటి అన్ని రకాల మౌలిక సదుపాయాలను క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంచే బాధ్యత అధికారులదేనన్నారు.




## నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో ఎస్సైల బదిలీలు..

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ముగ్గురు ఎస్సైల బదిలీలు జరిగాయి. ఈ మేరకు సీపీ సాయి చైతన్య గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న సాయన్న నాల్గో టౌన్‌కు బదిలీ అయ్యారు. వీఆర్‌లోనే ఉన్న ఉమెన్ ఎస్సై కల్యాణిని నగరంలోని ఒకటో టౌన్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. అలాగే వీఆర్‌లో ఉంటూ నందిపేట్ పీఎస్‌లో అటాచ్‌గా పనిచేస్తున్న ఎల్ రాంను బోధన్ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేస్తూ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు.




## జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా ముక్తిద బాధ్యతల స్వీకరణ

**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పి.ముక్తిద నియమితులయ్యారు. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వుల మేరకు గురువారం ఆమె బాధ్యలు స్వీకరించారు. కామారెడ్డి 1 అదనపు జిల్లా న్యాయమూర్తిగా, పోక్సో ప్రత్యేక న్యాయస్థాన న్యాయమూర్తిగా, జిల్లా న్యాయ సేవా సంస్థ ఛైర్‌పర్సన్‌గానూ ఆమె పదవీబాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఆమె యాదాద్రి భువనగిరి జిల్లాలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తిగా విధులు నిర్వహించి బదిలీపై కామారెడ్డికి వచ్చారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన జిల్లా న్యాయమూర్తికి న్యాయాధికారులు సూరా సుమలత, సుధాకర్, దీక్ష, ప్రధాన పరిపాలనా అధికారి రాంచందర్ రావు, ఉషారాణి, సిబ్బంది భుజంగరావు, వెంకట్ రెడ్డి, చంద్రసేన్ రెడ్డి, నిఖిల్ రెడ్డి, కరుణ, మమతతో పాటు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణ, ప్రభుత్వ న్యాయవాది శ్యాం గోపాల్ రావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయవాదులు, జిల్లా న్యాయ వ్యవస్థ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

## బాన్సువాడలో నాటు తుపాకుల తయారీ.. 8 మంది అరెస్ట్



**అక్షరటుడే, కామారెడ్డి :** బాన్సువాడ కేంద్రంగా నాటు తుపాకులు తయారు చేస్తున్న ముఠా గుట్టును కామారెడ్డి పోలీసులు రట్టు చేశారు. తుపాకులు తయారు చేస్తున్న వ్యక్తితో పాటు అడవి జంతువుల అక్రమ వేటకు పాల్పడుతున్న మొత్తం 8 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు ఎస్పీ రాజేష్ చంద్ర మీడియాకు వివరాలు వెల్లడించారు. బుధవారం రాత్రి గాంధారి పీఎస్ పరిధిలోని మొండి సడక్ చౌరస్తా వద్ద గాంధారి ఎస్సై మహేందర్, సిబ్బంది వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా బజాజ్, హెచ్‌ఎఫ్ డీలక్స్ మోటార్ సైకిళ్లపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించారు. అప్రమత్తమైన పోలీసులు వారిని వెంబడించి పట్టుకుని విచారించగా అడవి జంతువుల వేట కోసం నాటు తుపాకులు కొనుగోలు చేసి వినియోగిస్తున్నట్లు అంగీకరించారు. వారి వద్ద 2 నాటు తుపాకులు స్వాధీనం చేసుకున్నారు. వారిచ్చిన సమాచారంతో ఎస్పీ ఆదేశాల మేరకు సదాశివనగర్ సీఐ, గాంధారి, తాడ్వాయి ఎస్ఐలు, సిబ్బందితో మూడు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దాడులు నిర్వహించారు. నిందితులు సలావత్ చందర్, ఆంగోత్ ధర్మ నాయక్ అలియాస్ ధర్మ, బాన్సువాడకు చెందిన అస్లాం దావుస్‌లు నిజాంపేట్, బాన్సువాడ మండలాల్లోని చిన్నరాంపూర్, హాజీపూర్ గ్రామాల్లో ఒకొక్క తుపాకీని రూ.10వేలకు విక్రయిస్తున్నట్లు తేలిందన్నారు. గండివేట్ తండాకు చెందిన విస్లావత్ అరుణ్, విస్లావత్ గోపిచంద్, ఆంగోత్ లక్ష్మణ్, విస్లావత్ నాను, విస్లావత్ గణేశ్‌లు నిందితులుగా ఉన్నారని ఎస్పీ తెలిపారు. మూడు గన్‌లకు ట్రిగ్గర్ మెకానిజమ్‌లు లేకపోవడంతో గండివేట్ తండా సమీపంలో పొలంలో దాచిపెట్టినట్లు చెప్పగా, స్వాధీనం చేసుకున్నారని వివరించారు. జిల్లాలో అక్రమ ఆయుధాల సంస్కృతికి, వన్యప్రాణుల వేటకు తావులేదని ఎస్పీ హెచ్చరించారు. నేరస్తులకు సింహస్వప్నంగా, ప్రజలకు రక్షణగా 'ఆపరేషన్ కవచ్' ద్వారా నిరంతర నిఘా కొనసాగుతుందని, చట్టవ్యతిరేక చర్యలపై ఉక్కుపాదం మోపుతామని స్పష్టం చేశారు. నిందితుల నుంచి 5 నాటు తుపాకులు, ఒక ఎయిర్ గన్, 3 ట్రిగ్గర్ మెకానిజమ్‌లు, 3 చాప్స్, స్టీల్ పెలెట్స్, గన్‌పౌడర్, పొటాష్, ఫ్లెట్స్‌తో పాటు భారీగా వేట సామగ్రి, రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. అక్రమ ఆయుధాల సరఫరా, వన్యప్రాణుల వేట ముఠా నెట్‌వర్క్‌ను ఛేదించిన సదాశివనగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ కుమార్, గాంధారి ఎస్ఐ మహేందర్, తాడ్వాయి ఎస్ఐ నరేశ్, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి రివార్డులు అందజేశారు. సమావేశంలో డీఎస్పీ శ్రీనివాస్ రావు, సీఐ సంతోష్ కుమార్, గాంధారి, తాడ్వాయి ఎస్సైలు మహేందర్, నరేష్ పాల్గొన్నారు.

## నిర్దేశిత లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలి

**అక్షరటుడే, కామారెడ్డి:** జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో నిర్దేశిత లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలని కామారెడ్డి జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి వెంకటి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. ప్రభుత్వ లక్ష్యాలను సకాలంలో సాధించాలని, క్షయ, కుష్ఠు కేసులను ముందస్తుగా గుర్తించి పూర్తి చికిత్స అందించాలని, బీపీ, మధుమేహం, నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతం చేయాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, అతిసార నివారణకు ప్రత్యేక చర్యలు, పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరం చేయాలన్నారు.



## 'అధికారం కోసం నియంతగా మారిన ఇందిరాగాంధీ'



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** భారతదేశ ప్రజాస్వామ్య చరిత్రలో జూన్ 25 చీకటి రోజు అని.. అధికారం కోసం ఇందిరాగాంధీ అప్పట్లో నియంతగా మారారని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఎమర్జెన్సీ డే నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 1971 ఎన్నికల్లో ఇందిరా గాంధీ ఉత్తర ప్రదేశ్‌లోని రాయ్ బరేలీలో పోటీ చేసి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని తెలిపారు. దీంతో అలహాబాద్ హైకోర్టు నాలుగేళ్లు విచారించిన తర్వాత అధికార దుర్వినియోగం జరిగిందని తీర్పునిచ్చిందని చెప్పారు. ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదని అలాగే ఆరేళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేయరాదని నిషేధం విధించిందన్నారు. కానీ ఇందిరా గాంధీ రాష్ట్రపతిని కలిసి అంతర్గత భద్రత కారణాన్ని చూపి ఎమర్జెన్సీ ప్రకటించారని విమర్శించారు. ప్రతిపక్ష నేతలైన అటల్ బిహారీ వాజ్‌పేయి, అద్వానీ, మొరార్జీ దేశాయ్ లాంటి వారిని వారెంట్ లేకుండా అరెస్టు చేశారని గుర్తు చేశారు. ఎమర్జెన్సీ సమయంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాసిన పత్రిక కార్యాలయాలకు విద్యుత్ కోత విధించడం, జర్నలిస్టులను జైల్లో పెట్టించారన్నారు. బలవంతంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించి, ప్రజల స్వేచ్ఛను పూర్తిగా హరించారని విమర్శించారు. అలాగే ఇందూరు నుంచి అనేక మంది ఎమర్జెన్సీ కాలంలో జైలు శిక్ష అనుభవించారని గుర్తు చేశారు. అలాగే జూన్ 25న సంవిధాన్ హత్య దివస్‌గా పాటిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోల్ల లక్ష్మీనారాయణ, ఫ్లోర్ లీడర్ ప్రమోద్, కార్పొరేటర్లు బెల్లాల్ శశాంక్, జ్యోతి మురళి, బంటు ప్రీతి ప్రవీణ్, ప్రసన్న సత్యపాల్, సుమిత్ర కిషోర్, ప్రసూన శ్రీనివాస్, ఓబీసీ మోర్చా నాయకుడు స్వామి యాదవ్, ఆయా మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లోకి మాల్తుమ్మెద జీపీ పాలకవర్గం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** నాగిరెడ్డిపేట మండలం మాల్తుమ్మెద గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారిని ఎమ్మెల్యే మదన్ మోహన్ సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుండగా, మాల్తుమ్మెద గ్రామం కూడా అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. గ్రామంలో సీసీ రోడ్లు, తాగునీటి సౌకర్యాలు, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, గృహ జ్యోతి పథకం వంటి అనేక ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు అందుతున్నాయని సభ్యులు పేర్కొన్నారు. గ్రామ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే మదన్ మోహన్ నాయకత్వంలో భాగస్వాములు కావాలనే సంకల్పంతో సమిష్టిగా కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్నంత కాలం అభివృద్ధిలో వేగం తగ్గదన్నారు.



## ఫీజు బకాయిలు విడుదల చేయడంలో ప్రభుత్వం విఫలం

**అక్షరటుడే, కామారెడ్డి:** తెలంగాణలో విద్యార్థుల ఫీజు బకాయిలను విడుదల చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు డాక్టర్ బాలు విమర్శించారు. గురువారం ఆయన కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులతో కలిసి సీఎం చిత్రపటాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మూడేళ్లుగా బీసీ విద్యార్థుల ఫీజు బకాయిలు పెండింగ్‌లో ఉండడంతో కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులు సర్టిఫికెట్లు పొందలేక, ఫీజులు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పటికీ విద్యార్థులకు న్యాయం జరగడం లేదని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన విద్యార్థి వ్యతిరేక విధానాలనే కాంగ్రెస్ కొనసాగిస్తోందని ఆరోపించారు.



## ఆస్పత్రిలో బాధితుడిని పరామర్శించిన జీవన్‌రెడ్డి

**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ నదీం సోదరుడి కుమారుడు కరీం హైదరాబాద్‌లోని రెయిన్‌బో చిల్డ్రన్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి గురువారం ఆస్పత్రిలో బాలుడిని పరామర్శించాడు. మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆస్పత్రి వైద్యులకు సూచించారు.





# ఉక్కపోతకు ఉపశమనం..



నగరంలో గురువారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి నగరవాసులు ఉపశమనం పొందారు. వానాకాలం ప్రారంభమైనప్పటికీ ముఖం వర్షాలు చాటేశాయి. దీంతో విపరీతమైన ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోయారు. అయితే బుధ, గురువారాల్లో కురిసిన వర్షాలతో కొద్దిమేర ఉపశమనం లభించింది. అలాగే రైతులు సైతం పొలం పనుల్లో బిజీ అయ్యారు.

– అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నిజామాబాద్



## ‘బడిబాట’ ప్రచారంలో కోమన్‌పల్లి విద్యార్థుల ప్రతిభ

**అక్షరటుడే, ఆర్మూర్:** కోమన్‌పల్లి హైస్కూల్ విద్యార్థులు బట్టు శివాని, నిమ్మ శ్రీశాంత్‌లను గురువారం అడిషనల్ కలెక్టర్ కిరణ్, డీఈవో అశోక్‌లు ఘనంగా సన్మానించారు. బడిబాట ప్రచారం కోసం రూపొందించిన వీడియోలలో వీరిద్దరూ నటించి అందరి అభినందనలు అందుకున్నారు. గురువారం తెలంగాణ విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా ఆవిష్కరించిన మూడు తరాలు బడిబాట షార్ట్ ఫిలింలో ఈ ఇద్దరు నటించి అందరి ప్రశంసలు అందుకున్నారు. కోమన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న శివాని బడిబాట వీడియోల్లో తన నటనతో అందరినీ ఆకట్టుకుంది. ప్రభుత్వ పాఠశాలలో చదవడం వల్ల ఎలాంటి ప్రయోజనాలు పొందవచ్చనే అంశాలతో రూపొందించిన వీడియోలో శివాని, శ్రీశాంత్ తమ నటనతో జిల్లావ్యాప్తంగా అందరి ప్రశంసలు అందుకున్నారు. విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా కలెక్టరేట్‌లో జరిపిన సమీక్ష సమావేశంలో మూడు తరాలు షార్ట్ ఫిలీం ఆవిష్కరించి చూశారు. కార్యక్రమంలో ఆర్మూర్ ఎంఈవో రాజగంగారాం, ఉపాధ్యాయులు కాసర్ల నరేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.





## ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాల విక్రయాలను అరికట్టాలి

**అక్షరటుడే, ఆర్మూర్:** ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాల విక్రయాలను అరికట్టాలని బీఆర్ఎస్వీ షాహిద్ అలీ, పీడీఎస్‌యూ నిఖిల్ అన్నారు. గురువారం పట్టణంలోని క్షత్రియ స్కూల్‌లో స్కూల్ లోగోతో విక్రయిస్తున్న బుక్స్‌తో వారు నిరసన తెలిపారు. అనంతరం బీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు షాహిద్ అలీ మాట్లాడుతూ వారం రోజులుగా ప్రైవేట్ విద్యాసంస్థలపై వరుసగా ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో పాఠశాలలను సందర్శించి, సమస్యలను విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నామని తెలిపారు. అయినప్పటికీ కొన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల వైఖరిలో మార్పు రావడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు రవి, దీపక్, జుబేర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## కారును ఢీకొన్న లారీ..

### చిట్టాపూర్ జంక్షన్ వద్ద ఘటన

**అక్షరటుడే, బాల్కొండ:** వేగంగా వెళ్తున్న లారీ.. కారును ఢీకొంది. ఈ ఘటన మండలంలోని చిట్టాపూర్ జంక్షన్ వద్ద గురువారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హర్యానా రాష్ట్రానికి చెందిన ట్రక్ చిట్టాపూర్ జంక్షన్ వద్ద కారును ఢీకొంది. ఈ ఘటనలో కారు పూర్తిగా దెబ్బతిన్నప్పటికీ కారులో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు. దీంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. బాల్కొండ పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.



## ప్రమాదకరంగా మ్యాన్‌హోళ్లు..

నగరంలోని పలు డివిజన్లలో మ్యాన్‌హోళ్లు ప్రమాదకరంగా మారాయి. నడిరోడ్డుపై గుంతలు పడడంతో పాదచారులకు, బైక్‌లపై వెళ్లేవారికి ప్రమాదం పొంచి ఉంది. నగరంలోని 7, 8 డివిజన్ పరిధిలోని న్యాల్‌కల్ రోడ్డుపై రామాలయం వద్ద రోడ్డుపై మ్యాన్‌హోల్ పూర్తిగా పగిలిపోయి ప్రమాదకరంగా మారింది. వెంటనే ఈ మ్యాన్‌హోల్‌పై మూతను మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

– అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నిజామాబాద్

## ఆలూర్‌లో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ



**అక్షరటుడే, ఆర్మూర్ :** ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో భాగంగా ఆలూర్ మండలంలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని తహశీల్దార్ రమేష్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జూన్ 25 నుంచి జూలై 24 వరకు మండలంలోని ప్రతి గ్రామంలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను అందజేశారు. ఓటర్లు తమ వ్యక్తిగత వివరాలు, చిరునామా, కుటుంబ సభ్యుల వివరాలు తదితర అంశాలను ఫారంలో సక్రమంగా నమోదు చేసి, అవసరమైన ధ్రువపత్రాల ప్రతులతో కలిసి సంబంధిత బీఎల్‌వోలకు అందజేయాలని సూచించారు. ఓటరు జాబితాలో పేర్లు, చిరునామాలు, ఇతర వివరాలు ఖచ్చితంగా నమోదయ్యేలా కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం నిర్వహిస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ వివరాలను సరిచూసుకోవాలని, కొత్తగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాల్సిన వారు కూడా అవసరమైన వివరాలు సమర్పించాలని కోరారు. ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా, తప్పులులేకుండా రూపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తహశీల్దార్ తెలిపారు.

## రైతులు విత్తన మేళాలను సద్వినియోగం చేసుకోవాలి



**అక్షటుడే, పెద్దకొడప్‌గల్ :** విత్తనాల మేళాలను రైతులు వినియోగించుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్యామప్ప పటేల్ సూచించారు. గురువారం ఆయన రైతుమేళాను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. నాణ్యమైన విత్తనం అధిక దిగుబడికి పునాది అని అన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం జూన్ 23 నుంచి 30వ తేదీ వరకు ప్రతి మండలంలో నిర్వహిస్తున్న విత్తన మేళాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మేళాలో గల వివిధ రకాల విత్తనాల ఉత్పత్తులను పరిశీలించారు. రైతు వేదికలలో నిర్వహిస్తున్న ఈ విత్తన మేళాల్లో సన్న వడ్లు, పప్పు దినుసులు, నూనె గింజలు, కూరగాయల విత్తనాలతో పాటు నానో యూరియా, నానో డీఏపీ వంటి ఆధునిక వ్యవసాయ ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు. అనంతరం వ్యవసాయ అధికారి కిషన్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులు నెలకొన్న సమయంలో యూరియాను అధిక మోతాదులో వినియో గించడం వల్ల భూసారం దెబ్బతింటుందని తెలిపారు. శాస్త్రీయ పద్ధతుల్లో ఎరువులను వినియోగించాలని రైతులకు సూచించారు. ప్రతి గ్రామంలో రైతులకు అవసరమైన మేరకు యూరియా అందుబాటులో ఉండేలా తగిన నిల్వలు ఉంచాలని అధికారులను ఆదేశించారు. రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అలాగే మహిళా రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి, నిర్వహణ, విక్రయాల తీరును పర్యవేక్షించి, కేంద్రం మరింత సమర్థవంతంగా పనిచేసేలా పలు సూచనలు చేశారు.


నగరంలోని నిర్మల హృదయ పాఠశాలలో..


కామారెడ్డిలో..


నిజామాబాద్‌లో..

# మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

అంతర్జాతీయ మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, దుర్వినియోగ వ్యతిరేక దినాన్ని గురువారం ఉమ్మడి జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు ఆయా ప్రాంతాల్లో విద్యార్థులు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. మాదక ద్రవ్యాలతో కలిగే దుష్పరిణామాలపై వివరించారు. – అక్షరటుడే, నెట్‌వర్క్


లింగంపేటలో..


నగరంలోని నాగారంలో..


ఆర్మూర్‌లో..


మెండోరాలో..

## ఎస్సీ,ఎస్టీ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

**అక్షరటుడే, కామారెడ్డి:** ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టుల సమస్యలు ఈనెల 28లోగా పరిష్కరించాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాదేపురం గంగన్న డిమాండ్ చేశారు. లేకపోతే 29న హైదరాబాద్‌లోని ఐఅండ్‌పీఆర్ కమిషనరేట్‌ను ముట్టడిస్తామన్నారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. అక్రెడిటేషన్ల మంజూరులో దళిత, గిరిజన జర్నలిస్టులపై వివక్ష కొనసాగుతోందన్నారు. అక్రెడిటేషన్ల కమిటీల్లో ఎస్సీ, ఎస్టీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులకు వెంటనే అక్రెడిటేషన్ల కార్డులు మంజూరు చేయాలని, 2024 వరకు ఉన్న కార్డుల గడువు ముగిసి ఇన్ని రోజులవుతున్నా కొత్తవి ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, వారి పిల్లలకు పాఠశాలలు, కళాశాలల్లో 100శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని, సంక్షేమ పథకాల్లో మొదటి ప్రాధాన్యం కల్పించాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నుంచి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వరకు దళిత, గిరిజన జర్నలిస్టులకు అన్యాయం జరుగుతోందని గంగన్న ఆరోపించారు. సమస్యలపై 28లోగా స్పందించకుంటే 29న మాసబ్‌ట్యాంక్‌లోని ఐ అండ్ పీఆర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని, ఈ ఉద్యమానికి ప్రజాసంఘాలు, న్యాయవాదులు మద్దతివ్వాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు తెడ్డు సాయిలు, జిల్లా అధ్యక్షుడు కుంటొల్ల యాదయ్య, జాయింట్ సెక్రెటరీ పెరుమాళ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

